క్లుప్తంగా

ఘనంగా జలబిందెల మహోత్సవం



నందిగామ: పట్టణంలోని రెవెన్యూకాలనీలో వేంచేసియున్న భద్రకాళి సమేత వీరభద్ర స్వామివార్ల కల్యాణ మహోత్సవ వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారికి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. జలబిందెల మహోత్సవం వేడుకలా సాగింది. పట్టణంలోని అన్ని ప్రధాన వీధుల్లో ఈ జలబిందెల కార్యక్రమం కొనసాగింది. రాత్రి సమయంలో అంకమ్మ అమ్మవారి రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారుల నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగిన ఈకార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.50వేల విరాళం



వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి జగ్గయ్యపేటకు చెందిన తాడికొండ రామారావు దంపతులు రూ.50 వేలు విరాళంగా అందించినట్లు ఈవో హేమలతాదేవి శనివారం తెలిపారు. ఆలయ అధికారులు, దాతలకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

కమనీయం.. స్వామివారి కల్యాణం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీస్వయంభూ శంభులింగేశ్వరస్వామివారి ఆలయంలో శుక్రవారం రాత్రి శ్రీశివపార్వతుల కల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. కల్యాణ పీటలపై మాదినేని నాగకృష్ణమూర్తి, అనూష, నాదెళ్ల శంతన్, లిఖిత దంపతులు కూర్చొన్నారు. కల్యాణానికి ముందు లింగగూడెంకు చెందిన స్నిగ్ధ కూచిపూడి నృత్యప్రదర్శన, కోలాట నృత్యాలు, భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శ్రీఅయ్యప్ప సేవాసమితి అధ్యక్షులు వాసిరెడ్డి బెనర్జీ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ముండ్లపాడులోని పురాతన శివాలయంలో స్వామివారి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన

వీరులపాడు : గ్రామీణ ప్రాంతాల్లోని అంతర్గత రహదారులను సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ కుమార్ తెలిపారు. మండలంలోని పెద్దాపురంలో రూ.15లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ జెడ్పీ నిధులు రూ.10లక్షలు, పంచాయతీ నిధులు రూ.5లక్షలతో సిమెంట్ రోడ్లు నిర్మిస్తున్నట్లు వివరించారు. ఎంపీపీ కోటేరు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తిసౌజన్య, ఏఎంసీ చైర్మన్ కోటేరు మల్లేశ్వరి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మిశెట్టి భాస్కరరావు, సర్పంచి నిప్పులపల్లి శాంతమ్మ, ఉపసర్పంచి బవిరిశెట్టి లక్ష్మి, సొసైటీ చైర్మన్ ఆవుల ప్రసాద్, తహసీల్దార్ రాజకిషోర్, ఎంపీడీవో శివపార్వతి, మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్ల రాణి, ఏపీఎం యెహోషువా, నాయకులు పూలా రాంబాబు, ఇప్పల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమ ఫలాలు



నందిగామ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందాయని రామిరెడ్డిపల్లి వైఎస్సార్ సీపీ గ్రామనాయకుడు వీరమాచినేని నాగమల్లేశ్వరరావు అన్నారు. ఇంటింటికీ వలంటీర్ కార్యక్రమంలో భాగంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి నాలుగేళ్ల పదినెలల కాలంలో రామిరెడ్డిపల్లిలో జరిగిన అభివృద్ధిని గ్రామంలో ప్రతిఇంటికి వెళ్లి వివరించారు. ఈ సందర్భంగా నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రభుత్వం పథకాల ద్వారా ఎంతో మందికి లబ్ధిచేకూరిందని వివరించారు. ఒక్క రామిరెడ్డిపల్లి గ్రామాల్లోనే 786 కుటుంబాలకు సుమారు రూ.20 కోట్ల రూపాయల మేర లబ్ధి చేకూరిందని తెలిపారు.

మహిళలకు అండగా సీఎం జగనన్న

ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్

కంచికచర్ల: మహిళల ఆర్థికస్వావలంబనతోనే సమాజాభివృద్ధి సాధ్యమనే సూత్రీకరణకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ చేయూత పథకం ద్వారా మహిళలకు అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. కంచికచర్ల ఓసీ క్లబ్‌లో వైఎస్సార్ చేయూత పథకం నాలుగో విడత కింద మండలంలోని 3942 మంది మహిళలకు రూ.7.40కోట్లను అందజేశారు. నమూనా చెక్కును పంపిణీ చేశారు. తొలుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్ మాట్లాడుతూ సీఎం జగనన్న వైఎస్సార్ చేయూత కింద కంచికచర్ల మండలంలోని మహిళలకు నాలుగువిడతల్లో కలిపి రూ.26.80కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. సంక్షేమ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు నందిగామ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిలు కృషిచేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావును రానున్న ఎన్నికల్లో మహిళలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి వేల్పుల సునీత, జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, వైస్ ఎంపీపీలు బండి మల్లికార్జునరావు, వెలగలేటి మాధవి, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, నాయకులు చింతా రవీంద్రనాథ్, పరిటాల రాము, కాలవ పెదబాబు, బుడ్డి సత్యనారాయణ, మాడుగుల మధుబాబు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కంచర్ల పద్మావతి, మార్త శ్రీనివాసరావు, రాయల నరసింహారావు,



కంచికచర్లలో వైఎస్సార్ చేయూత పంపిణీ కార్యక్రమానికి హాజరైన మహిళలు



చేయూత నమూనా చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్



పెద్దాపురంలో నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్

కోదాటి రామకృష్ణ, ఏపీఓం కోట భాస్కరరావు, వెలుగు సీసీలు, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు. వైఎస్సార్ చేయూత పథకం కింద ఈ నాలుగేళ్లలో రూ.75వేలు అందడంపై లబ్ధిదారులైన మహిళలు హర్షం వ్యక్తం చేశారు. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. మహిళల అభిప్రాయాలు..వారి మాటల్లోనే...

2993 మందికి 5.49కోట్లు...

వీరులపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ చేయూత పథకం ద్వారా మహిళలకు నాలుగేళ్లలో రూ.75వేలు అందిస్తూ వారి అభ్యున్నతికి కృషిచేస్తున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ కొనియాడారు. మండలంలోని పెద్దాపురంలో శనివారం వైఎస్సార్ చేయూత నాలుగో విడత కింద మండలంలోని 2993మందికి రూ.5.49కోట్లను అందజేశారు. ఈ మేరకు ఎమ్మెల్సీ, మహిళలకు నమూనా చెక్కును అందజేసి అభినందించారు. అనంతరం ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ నాలుగేళ్ల పదినెలల కాలంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వేసిన ప్రతిఅడుగు నిరుపేదలకు మంచి చేసేందుకేనని తెలిపారు. గత ప్రభుత్వంలో మాదిరిగా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే విస్మరించకుండా ప్రతి హామీని అమలుచేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ కోటేరు మల్లేశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తిసౌజన్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్‌బేగం, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మిశెట్టి భాస్కరరావు, సర్పంచి నిప్పులపల్లి శాంతమ్మ, ఉపసర్పంచి బవిరిశెట్టి లక్ష్మి, సొసైటీ చైర్మన్ ఆవుల ప్రసాద్, తహసీల్దార్ రాజకిషోర్, ఎంపీడీవో శివపార్వతి, మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్ల రాణి, ఏపీఎం యెహోషువా, నాయకులు పూలా రాంబాబు, ఇప్పల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రూ.75వేలు ఇచ్చారు..



వైఎస్సార్ చేయూత పథకం కింద సీఎం జగనన్న ఇప్పటి వరకు నాలుగు విడతల్లో కలిపి నాకు రూ.75వేలు ఇచ్చారు. ఈ డబ్బులతో టైలరింగ్‌షాపు, బట్టల దుకాణం నడుపుతున్నాం. ఆసరా, డ్వాక్రా రుణాల కింద ఆర్థికసాయం అందింది. మహిళలకు అండగా నిలుస్తున్న సీఎం జగనన్నకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

– దోనేపల్లి కళావతి, పరిటాల

బియ్యం దుకాణం నడుపుతున్నా..



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మా కుటుంబానికి వైఎస్సార్ చేయూత, ఆసరా, డ్వాక్రా రుణాలు అందుతున్నాయి. ప్రతినెలా ఒకటో తేదీన తెల్లవారకముందే పింఛన్ ఇస్తున్నారు. సీఎం జగన్‌కు మాకుటుంబమంతా రుణపడి ఉంటాం. మరోసారి సీఎం జగనన్న గెలిపించేందుకు నావంతు కృషిచేస్తా.

– జంగా రాణి, బత్తినపాడు

మాట నిలబెట్టుకున్నారు..



పొదుపు రుణాలు మొత్తం మాఫీ చేస్తానంటే నమ్మబుద్ధి కాలేదు. అయితే ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో రుణాలు మాఫీ చేశారు. నాలుగేళ్లుగా చేయూత ద్వారా అందుతున్న డబ్బులతో పరదాలు కుట్టించి, విక్రయిస్తూ ఆర్థికంగా నిలద్రొక్కుకుంటున్నా. సీఎం జగన్ పాలనలో బాగున్నాం. మాట తప్పని జగనన్నను మళ్లీ గెలిపించి తీరతాం.

– బాణావత్ సోమ్లు, కంచికచర్ల

జగనన్నకు రుణపడి ఉంటాం..



మూడేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో కాలు విరిగిపోయింది. అయినా మొక్కవోని ధైర్యంతో బతుకుబండిని లాగుతున్నాం. సీఎం జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఐదేళ్లలో మాకుటుంబానికి వైఎస్సార్ చేయూత, అమ్మఒడి, విద్యాదీవెనతోపాటు డ్వాక్రా రుణమాఫీ జరిగింది. సీఎం జగనన్నకు మాకుటుంబం ఎంతో రుణపడి ఉంటుంది.

– సోమవరపు పద్మ, కంచికచర్ల

శరవేగంగా ఫౌంటెయిన్ పనులు



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని విజయవాడ రోడ్డు వైఎస్సార్ సర్కిల్ వద్ద పురపాలక సంఘం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వాటర్ ఫౌంటెయిన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ9.80లక్షలతో నిర్మిస్తున్న ఈ వాటర్ ఫౌంటెయిన్‌తోపాటు విద్యుత్‌లైట్లతో స్వాగతం జగ్గయ్యపేట అనే అక్షరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఫౌంటెయిన్ చుట్టూత సుందరీకరణ పనులు సాగుతున్నాయి. ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను సూచనల మేరకు పట్టణ సుందరీకరణలో భాగంగా నెహ్రూచౌక్ వద్ద వాటర్ ఫౌంటెయిన్, ఐ లవ్ జగ్గయ్యపేట అనే అక్షరాలను విద్యుత్ లైట్లతో అందంగా ఏర్పాటు చేశారు. ప్రభుత్వాస్పత్రి వద్ద ప్రధాన ద్వారం పక్కన వాటర్ ఫౌంటెయిన్, విద్యుద్దీపాలతో మన జగ్గయ్యపేట అనే అక్షరాలను అందంగా ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సర్కిల్ వద్ద వాటర్ ఫౌంటెయిన్ పనులను మూడురోజుల్లో పూర్తిచేసి, వెంటనే వాటర్ ఫౌంటెయిన్‌ను ప్రారంభించేందుకు సంబంధిత అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

గురుకులంలో ప్రవేశాలకు ఎంట్రన్స్ పరీక్ష నేడు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేటలోని బలుసుపాడు రోడ్డులో ఉన్న డాక్టర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి (ఇంగ్లీష్ మీడియం), ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆదివారం ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కొండపల్లి లక్ష్మీ సుజాత శనివారం క ప్రకటన ద్వారా తెలిపారు. ఐదోతరగతి ప్రవేశం కోసం నిర్వహించే పరీక్ష ఉదయం పదిగంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఉంటుందన్నారు. అనంతరం మధ్నాహం రెండు గంటల నుంచి సాయంత్రం నాలుగున్నర గంటల వరకు ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాల కోసం ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు గంటముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

జగనన్న ఇళ్లపట్టాలు పంపిణీ

పెద్దాపురం(వీరులపాడు): అధికారంలోకి వచ్చిన నెలల వ్యవధిలోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదల సొంతింటి కలను సాకారం చేశారని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ కొనియాడారు. మండలంలోని పెద్దాపురం గ్రామానికి చెందిన 236మంది లబ్ధిదారులకు జగనన్న కాలనీలోని ఇళ్లను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి శనివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 31లక్షల మందికి పైగా ఒకేసారి ఇళ్లపట్టాలు అందజేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. ఇళ్లస్థలాలతోపాటు ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వపరంగా ఆర్థికసాయం అందిస్తున్నారని వివరించారు. ఎంపీపీ కోటేరు లక్ష్మి, జెడ్పీటీసీ అమర్లపూడి కీర్తిసౌజన్య, ఏఎంసీ చైర్మన్ కోటేరు మల్లేశ్వరి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచి నిప్పులపల్లి శాంతమ్మ, ఉపసర్పంచి బవిరిశెట్టి లక్ష్మి పాల్గొన్నారు.

కంచికచర్లలో..

కంచికచర్ల : నవరత్నాలు పథకం కింద రాష్ట్రంలోని పేదలందరికీ ఇళ్లస్థలాలు, ఇళ్లు మంజూరు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్సీ అరుణకుమార్ పేర్కొన్నారు. కంచికచర్లలో శనివారం ఆయన జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, సర్పంచి వేల్పుల సునీత, వైఎస్ ఎంపీపీలు బండి మల్లికార్జునరావు, వెలగలేటి మాధవి, ఎంపీటీసీ సభ్యులు మాడుగుల మధుబాబు, నాయకులు చింతా రవీంద్రనాథ్, పరిటాల రాము, బుడ్డి సత్యనారాయణ, కోదాటి రామకృష్ణ, వేల్పుల శ్రీనివాసరావు, రాయల నరసింహారావు, డిప్యూటీ తహసీల్దార్ నాగుల్‌మీరా, వీఆర్వో అనూష పాల్గొన్నారు.



ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్, ఎ.కీర్తిసౌజన్య, కె.లక్ష్మి

విజయమే లక్ష్యంగా పనిచేయాలి

నందిగామ టౌన్: రానున్న ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతిఒక్కరు పనిచేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణంలోని బూత్ కన్వీనర్లు, వార్డు కన్వీనర్‌లు, కౌన్సిలర్లతో శనివారం రాత్రి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ బూత్‌ల వారీగా ప్రతి ఓటరుపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇంటింటికీ వలంటీర్ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో నందిగామ మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మి, వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, నాయకులు గుడివాడ సాంబశివరావు, పాములపాటి రమేష్, చిరుమామిళ్ల చైతన్య కుమార్, దాసు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా పేట ఊరచెరువు

విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ప్రాంత ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంటున్న ఊరచెరువు అభివృద్ధి పనులను త్వరలో పూర్తిచేసి ప్రారంభిస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. ఊర చెరువు అభివృద్ధి పనులను శనివారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విప్ ఉదయభాను మాట్లాడుతూ సుమారు రూ.3కోట్లతో చేపట్టిన చెరువు అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. చెరువు నిర్మాణ పనులపై టీడీపీ వారు కోర్టులో కేసు వేయడంతో పనులు రెండునెలలు నిలిచిపోయాయన్నారు. టీడీపీ వారు కేసులు వేయకుండా పనులు పూర్తయి, 150అడుగుల జాతీయజెండా స్థూపం ఆవిష్కరణ రోజునే ప్రారంభింపజేసుకునేవారమని వివరించారు. ఊరచెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.40లక్షలతో ఫుట్‌పాత్ నిర్మించామని, మరొక రూ.40లక్షలతో చెరువు చుట్టూత ప్రహరీ గోడపై విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేసినట్లు వివరించారు. వాకింగ్ ట్రాక్‌కు ఇరువైపుల అందమైన ఆకర్షణీయమైన మొక్కలతో గ్రీనరీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



చెరువు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న పేట ఎమ్మెల్యే, విప్ సామినేని ఉదయభాను

జీవన ప్రమాణాలు పెంచేందుకే పథకాలు

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామ టౌన్): ప్రజల జీవనప్రమాణాలు పెంచేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. చందర్లపాడు మండలం గుడిమెట్ల గ్రామంలో శనివారం ఆయన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. వారి యోగక్షేమాలతోపాటు ఇబ్బందులను అడిగితెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయా సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరించి, ఆ పథకాల అమలుతేదీలతో కూడిన క్యాలెండర్‌ను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నిరుపేదకు సంక్షేమ పథకాలు అందించి వారి జీవనాభివృద్ధికి అండగా నిలిచారన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా నాలుగేళ్ల పదినెలల కాలంలో అర్హులైన ప్రతిఒక్కరికి డీబీటీ, నాన్‌డీబీటీ ద్వారా రూ.4.05లక్షల కోట్లను నేరుగా లబ్ధిదారులకు మేలు కలిగేలా కృషిచేశారని గుర్తుచేశారు.

రానున్న ఎన్నికలలో సైతం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తిరిగి అధికారంలోకి వస్తేనే ప్రస్తుతం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతాయని పేర్కొన్నారు. గతంలో పింఛన్ తీసుకోవాలంటే రోజుల తరబడి పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఉండేదని కానీ నేడు ఆ పరిస్థితి లేకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతినెల ఒకటోతేదీ తెల్లవారుజామునే ఠంచన్‌గా లబ్ధిదారులకు పింఛన్ అందుతోందని వివరించారు. అన్నివర్గాల ప్రజలకు మంచి చేయాలనే తపనతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి, రానున్న ఎన్నికల్లో ఆయనకు ఘనవిజయాన్ని అందించాలని కోరారు.కార్యక్రమంలో నాయకులు కర్ల తిరుపతిరావు, బత్తిన వెంకటేశ్వరరావు, వైఎస్‌ఎన్ ప్రసాద్, వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గుడిమెట్లలో వృద్ధురాలి యోగక్షేమాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వైభవంగా ముక్తేశ్వరుని కల్యాణం

ముక్త్యాల(జగ్గయ్యపేట): ముక్త్యాలలోని శ్రీభవానీ ముక్తేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం శుక్రవారం అర్ధరాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో శివపార్వతుల కల్యాణ ఉత్సవమూర్తులను అర్చకులు మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం యాగ్నిక అర్చకుడు జొన్నాబొట్ల కిషోర్‌శర్మ ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు వారణాసి సాంబశివరావు, తూమాటి లక్ష్మీనరసింహాచార్యులు, మద్దిరాల ప్రేమ్‌కుమార్‌శర్మ శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం జరిపించారు. సుమారు రెండుగంటలపాటు సాగిన కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు రెండు తెలుగురాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త తరఫున కేసీపీ సిమెంట్స్ కర్మాగారం ప్రతినిధులు కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలుచేసి, స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ఈవో జయప్రకాష్‌బాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ హేమలతాదేవి కల్యాణోత్సవాన్ని పర్యవేక్షించారు. కల్యాణం అనంతరం స్వామివారికి లింగోద్భవ అన్నాభిషేకం నిర్వహించారు. తహసీల్దార్ శేషగిరి, సీఐ జానకిరామ్ ఆధ్వర్యంలో చిల్లకల్లు, వత్సవాయి, పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట ఎస్ఐలు బందోబస్తు నిర్వహించారు.

కోటిలింగాలలో..

గ్రామ సమీపంలోని కోటిలింగ హరిహరక్షేత్రంలో వేంచేసియున్న కామాక్షి సమేత పంచముఖ అమృతలింగేశ్వర స్వామివారి కల్యాణోత్సవాన్ని శుక్రవారం అర్ధరాత్రి ఒంటిగంటకు కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చి కల్యాణం జరిపించారు. అనంతరం మూలవిరాట్‌కు 108 కేజీల అన్నంతో శాస్త్రోక్తంగా అన్నాభిషేకంతోపాటు భస్మాసుర అభిషేకాన్ని అర్చకులు తేజ ఆధ్వర్యంలో నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలిరాగా, ఏర్పాట్లను ఈవో బొగ్గవరపు రవీంద్రబాబు పర్యవేక్షించారు.

కన్నుల పండువగా శివపార్వతుల కల్యాణం

నందిగామ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి లింగోద్భవ సమయంలో దాములూరు కూడలి సంగమేశ్వరస్వామివారి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు మంత్రోచ్ఛరణల నడుమ ఆలయ పాలకవర్గ చైర్మన్ కనగాల వెంకటేశ్వరరావు దంపతులు పీటలపై కూర్చొని స్వామివారికి కల్యాణం జరిపించారు. అదేవిధంగా నందిగామలోని అంకమ్మవారి ఆలయంలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణం నేత్రపర్వంగా సాగింది. నందిగామ మెయిన్ రోడ్డులోని రామలింగేశ్వర స్వామికి లింగోద్భవ సమయంలో 108 కిలోల పంచదారతో ప్రత్యేకంగా అభిషేక కార్యక్రమాలు చేశారు. పట్టణ శివారుల్లోని పల్లగిరిగట్టుపైగల స్వయంభు శివలింగం వద్ద శివపార్వతుల మున్నేటి తీరాన రైతుపేట డొన్‌లోగల విజ్ఞాన నందీశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాలు శనివారం కన్నులపండువగా సాగాయి. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్లకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



ముక్త్యాలలో స్వామివారికి కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు



కూడలి సంగమేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

చందర్లపాడు(నందిగామ టౌన్): చందర్లపాడు మండలం కోనాయపాలెం గ్రామానికి చెందిన నాయీబ్రాహ్మణ సంఘ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రాయల ఏడుకొండలు సతీమణి సామ్రాజ్యం(80) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ కోనాయపాలెం వెళ్లి సామ్రాజ్యం మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏడుకొండలు, ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం సామ్రాజ్యం అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు. ఏడుకొండలు కుటుంబసభ్యులను పరామర్శించిన వారిలో నాయకులు బుగ్గినేని సురేష్, మార్కపూడి ప్రసాద్ తదితరులు ఉన్నారు.



రాయల సామ్రాజ్యం అంతిమయాత్రలో పాల్గొని పాడె మోస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

126 మందికి ప్రతిభా పురస్కారాలు అందజేత

కృష్ణలంక(విజయవాడతూర్పు):బాలికా విద్యను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో 10 తరగతి చదువుతున్న బాలికలకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నామని కోరమండల్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ జీవీ సుబ్బారెడ్డి అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో కోరమండల్ ఇంటర్నేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో తొమ్మిదో తరగతిలో ప్రతిభ కనబరిచిన 126 మంది విద్యార్థులకు రూ.5లక్షల 28వేల విలువైన బాలికా విద్యా స్కాలర్‌షిప్ పురస్కారాలు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ పథకం కింద బాలికా విద్య స్కాలర్‌షిప్‌లను సంస్థ చేపట్టిందన్నారు. విద్య, సమాజాభివృద్ధికి సంస్థ చేస్తున్న కృషిని వివరించారు. భవిష్యత్ లో మరిన్ని సేవా కార్యాక్రమాలను చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజినల్ బిజినెస్ హెడ్ చక్రవర్తి, డీజీఎం సచ్చిదానందరెడ్డి, మేనేజర్లు మురళీ, శ్రీను, సుధాకర్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com